క్లుప్తంగా

గంగమ్మ సేవలో ఎంపీ ఆదాల



నెల్లూరు రూరల్ : పడారుపల్లిలోని గంగమ్మ ఆలయంలో జరిగిన జాతరలో నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఎంపీకి స్వాగతం పలికారు. విజయా డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పలువురు కార్పొరేటర్‌లు నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న సీతారామ స్వామి మందిరంలో వేంకటేశ్వరస్వామికి ఆగస్టు 2వ తేదీ(బుధవారం) ఉదయం 11 గంటలకు కల్యాణం జరుగనుందని మందిర కమిటీ అధ్యక్షుడు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా సోమవారం తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి స్వామివార్లకు పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆగస్టు 30న నెల్సా మహాసభలు



పోస్టర్లను విడుదల చేస్తున్న న్యాయ విద్యార్థులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఎం కన్వెన్షన్ హాల్లో ఆగస్టు 30న నెల్లూరు లా స్టూడెంట్స్ అసోసియేషన్(నెల్సా) మొదటి మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పచ్చా కిరణ్ తెలిపారు. నగరంలోని వీఆర్ లా కళాశాల ప్రాంగణంలో నెల్సా మహాసభల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్సా మహాసభల్లో న్యాయ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. లా విద్యార్థులు హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. న్యాయ విద్యార్థులు దివ్య భారతి, మణి, సింధు, ఉమ, సౌందర్య, శివ, షాజీర్, సుజిత్, అక్రం, చంద్రమోహన్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీటిని ఒడిసి పట్టాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వర్షపునీటిని ఒడిసి పడితేనే భావితరాలకు నీటి అవసరాలు తీరుతాయని నెహ్రూ యువజన కేంద్ర కోఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో హోలీస్టార్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో వర్షపునీటి సంరక్షణపై సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపునీటిని వృథా చేయకుండా సంరక్షించుకోవాలని, ఇంకుడు గుంతల ద్వారా నీటిని నిలువ చేయటం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని తెలిపారు. అనంతరం ఇంకుడు గుంతల నిర్మాణాల గురించి స్వయం సహాయక సంఘ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నవబాలచందర్, అరవ రాయప్ప, బ్రహ్మయ్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ డీఎం ఉద్యోగ విరమణ



నెల్లూరు(బారకాసు) : స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.హేమలత సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా హోటల్ శివరామ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆ హోటల్‌లోని సమావేశ మందిరంలో ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. తొలుత ప్రేమలతను శాలువలు, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఝాన్సీలక్ష్మి హాజరై, ప్రేమలత సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాసులురెడ్డి, బ్యాంకు అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వర్ణాల తీరంలో సాయంత్రం వేళ భక్తుల రద్దీ





స్వర్ణాల తీరం.. కోలాహలం

నెల్లూరు(బారకాసు), నెల్లూరు(మినీబైపాస్) : నగరంలోని స్వర్ణాల తీరం భక్తజన సంద్రంగా మారింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కోర్కెల రొట్టెలు పడుతూ.. సమాధులను దర్శించుకున్నారు.

పటిష్ట ఏర్పాట్లు

రొట్టెల పండగ మూడో రోజు కూడా లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. అధికార యంత్రాంగం అందుకు తగ్గట్లుగా పటిష్ట ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్‌మర్మత్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి దర్గా ప్రాంగణంలో పర్యటిస్తూ ఏర్పాట్లను అనునిత్యం పర్యవేక్షించారు. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు చేపట్టాలని వారు సిబ్బందిని ఆదేశించారు.

కొనసాగుతున్న వైద్యసేవలు

దర్గా ప్రాంగణంలో ప్రభుత్వ, పలు ప్రైవేట్ వైద్య శిబిరాలు భక్తులకు అవసరమైన వైద్య సేవలను ఉచితంగా అందించాయి. అంతే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఆయా శిబిరాలను భక్తులు సద్వినియోగం చేసుకుంటున్నారు.



వరాల రొట్టెను పంచుకుంటున్న భక్తులు



మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్



దర్గాలోని సమాధులను దర్శించుకుంటూ..

ఉద్యోగ రొట్టెను పట్టుకున్నాం



పిల్లల చదువులు పూర్తి కావస్తోంది. వారు మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని రొట్టెను పట్టుకున్నాం. కోరిక నెరవేరితే వచ్చే సంవత్సరం రొట్టెను వదులుతాం. ప్రతి సంవత్సరం ఇలానే వస్తున్నాం. ప్రతి కోరిక నెరవేరింది.

– ఇలియాజ్– రిజ్వాన, ఖమ్మం, తెలంగాణ



విద్యుత్ కాంతుల మధ్య దర్గా

భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

• నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌కుమార్

నెల్లూరు(బృందావనం) : ప్రజలందరిపై భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ అన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బారాషహీద్ దర్గా రొట్టెల పండగలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గంధ మహోత్సవంలో ఆదివారం రాత్రి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు నెల్లూరు బారాషహీద్ దర్గాకు వచ్చి ఐదు రోజులు మత సామరస్యాన్ని చాటుతూ రొట్టెల పండగ జరుపుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో జరిగే గంధ మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అల్లాహ్ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో రాష్ట్రాన్ని సుభిక్షంగా పరిపాలించాలని భగవంతుని ప్రార్థించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్లు షేక్ కరీముల్లా, కిన్నెర ప్రేమ్‌కుమార్, నగర పాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, రొట్టెల పండగ కమిటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్‌ఖాదరి, ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్, వైఎస్సార్‌సీపీ నేతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గంధ మహోత్సవంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : రూరల్ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని 29వ డివిజన్ వెంకటరెడ్డినగర్‌లో 'గడప గడప మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నట్లు వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు కూడా అధిక నిధులను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూరల్ పరిధిలో అభివృద్ధి పనులకు త్వరితగతిన నిధులను కేటాయిస్తున్నట్లు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఘన విజయం సాధించేలా ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఓ రహదారి అధ్వానంగా ఉందని స్థానికులు ఎంపీ ఆదాల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన నగరపాలక సంస్థ అధికారులను పిలిచి రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయా డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, పార్టీ నేతలు హరిబాబు యాదవ్, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, లంకా రామశివారెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్ సత్తార్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటరమణ సేవలు ప్రశంసనీయం

నెల్లూరు(బృందావనం) : స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేస్తున్న జిల్లా దేవదాయ శాఖ సూపరింటెండెంట్ నెల్లటూరు వెంకటరమణ సేవలు ప్రశంసనీయమని ఆ శాఖ జిల్లా అధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని సర్వోదయ కళాశాల సమావేశ మందిరంలో వెంకటరమణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ దేవస్థానాలకు చెందిన కార్యనిర్వహణాధికారులు, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

అభినందన

ఎస్.వెంకటరమణ దంపతులను ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ముప్వ ప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘ నాయకులు బాలాజీ, రాజేష్ పాల్గొన్నారు.



ఎస్.వెంకటరమణ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

డీపీఎంఓకు అభినందన

నెల్లూరు(బారకాసు) : జిల్లా వైద్యారోగ్యశాఖలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి(డీపీఎంఓ)గా విధులు నిర్వహిస్తున్న బీవీ సుబ్బయ్య ఇటీవల పీహెచ్‌డీ సాధించగా, స్థానిక సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌టీబీఏఓ డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ సునీత్, ఫిజియోథెరపిస్టులు, డీపీఎంఓలు, ఏపీఎంఓలు పాల్గొన్నారు.



సుబ్బయ్యను సన్మానిస్తున్న ఉద్యోగులు

జిల్లా పీఠాధిపతుల ఆధ్వర్యంలో నిర్వహించాలి

నెల్లూరు(బృందావనం) : బారాషహీద్ దర్గా గంధ మహోత్సవాన్ని జిల్లాకు చెందిన పీఠాధిపతుల ఆధ్వర్యంలో నిర్వహించాలని జిల్లా ముస్లిం మత పీఠాధిపతుల సంఘం సమన్వయకర్త కేఎస్ఎస్ బాబా సాహెబ్ బందానవాజ్ తెలిపారు. చిన్నబజారులోని ఖాజాపీర్ మకాన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ స్థానిక పీఠాధిపతులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు.

3న వేలం

మనుబోలు: మనుబోలు పంచాయతీ పరిధిలోని పశువుల సంతకు ఈనెల 3వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీతో గడువు ముగుస్తుండడంతో తిరిగి వేలం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు వేలం జరుగుతుందని, ఆసక్తి గల వారు రూ.10 వేల ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాల కోసం పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కసుమూరులో పర్యాటకుల సందడి

వెంకటాచలం: పర్యాటకులతో మండలంలోని కసుమూరు దర్గా సందడిగా మారింది. నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగకు విచ్చేస్తున్న వారు కసుమూరుకు కూడా వస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి భక్తులు వేలాది సంఖ్యలో విచ్చేశారు. పోలీసులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయించారు.

ఎస్పీ ప్రార్థనలు

కసుమూరు దర్గాకు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి విచ్చేశారు. ఆయనకు ముజావర్లు ఘన స్వాగతం పలికారు.



ఎస్సీ రైతులకు విత్తనాల పంపిణీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం పలురకాల విత్తనాలను పంపిణీ చేశారు. నగరంలోని పొదలకూరు రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా షెడ్యూల్డ్ కులాల రైతుల ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో ప్రతి రైతుకు రూ.10 వేలు విలువ చేసే విత్తనాలను అందిస్తున్నట్లు తెలియజేశారు. మొత్తం 1,102 మంది రైతులకు రూ.1,10,20,000ల విలువైన విత్తనాలను అందజేస్తామని, త్వరలో మండల కేంద్రాల్లో 42 వ్యవసాయ పరికరాలను అందజేస్తామన్నారు. ప్రస్తుతం జొన్నలు, రాగులు, కొర్రలు, మినుములు, పెసలు, కందులు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, పిల్లిపెసర లాంటి విత్తనాలతో పాటు కిచెన్ గార్డెన్ విత్తనాలైన సొరకాయ, ఉల్లిపాయ, పొట్లకాయ, మిరప, వంకాయ, ముల్లంగి, బెండకాయ, బీన్స్, మెంతికూర, పాలకూర విత్తనాలను అందజేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ పీడీ రమేష్, ఈఓ సెల్వీ పాల్గొన్నారు.



విత్తనాలు అందుకున్న రైతులతో మంత్రి కాకాణి

వైభవంగా గంగమ్మ జాతర



దేవతాలంకరణలో నృత్యం చేస్తున్న మహిళ



గంగమ్మకు బోనాలను తీసుకెళ్తున్న భక్తులు

నెల్లూరు రూరల్ : రూరల్ నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్ పడారుపల్లిలో ఉన్న గంగమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా మండల పూజలు(48 రోజులు) పూర్తయిన సందర్భంగా జాతర జరిపించారు. ఇందులో భాగంగా మహిళలు గ్రామం నుంచి భక్తిశ్రద్ధలతో బోనాలను గంగమ్మ ఆలయం వరకు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. దేవతాలంకరణలో నృత్యాలు చేస్తూ తప్పెట్లు, బాణసంచా మధ్య కొమ్ము వాయిద్యాలు, వీరతాళ్లతో గంగమ్మ పెట్టెను ఊరేగించారు. ఆలయంలో అమ్మవారితో పాటు పోతురాజు స్వామికి ప్రత్యేక పూజలు, విశేషాలంకరణ చేశారు. సాయంత్రం పెద్ద ఎత్తున మహిళలు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పొంగళ్లు పెట్టుకుని నైవేద్యాలు సమర్పించారు. పలుప్రాంతాల భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గంగమ్మ సేవకుడు కాకుటూరు శ్రీహరి ఏర్పాట్లను పర్యవేక్షించారు, స్థానిక కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, నాయకులు సుబ్బారావు, పుల్లారెడ్డి, శేషయ్య, శివయ్య, పుల్లయ్య, మురళీ, మస్తాన్‌రెడ్డి స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



గంగమ్మ పెట్టెను ఊరేగిస్తున్న భక్తులు